

నడిపల్లి సర్పంచి చెక్ పవర్ రద్దు

ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా అధికారులు

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలం నడిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని పెదవేగి మండల ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి షరీఫ్ శుక్రవారం తెలిపారు. అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను సర్పంచికి సర్వ్ చేశామని తెలిపారు. ఇదే పంచాయతీలో విధులు నిర్వహించి నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఇరువురు కార్యదర్శులపై కూడా జిల్లా అధికారులు తీసుకోబోయే క్రమశిక్షణ చర్యలపై కూడా పెదవేగి మండలంలో ఆసక్తి నెలకొంది.

రైతులు ఓడారు.. కంపెనీలు గెలిచాయి..!


మాట్లాడుతున్న మంత్రులు అచ్చెన్నాయుడు, పార్థసారథి

- అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకోకు ధర ఇచ్చేది లేదన్న కంపెనీలు
- ప్రస్తుతం కిలో రూ.880 ఉంటే రూ.450నే ఇస్తామంటే సరేనన్న మంత్రులు
- ప్రభుత్వం రూ.50 ఇస్తుందని, కిలో రూ.500కు కొనుగోలు చేస్తారని ముగింపు
- చర్చలు విఫలమయ్యాయని ఆందోళనకు దిగిన కోకో రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కోకో ధర విషయంలో జరిగిన చర్చల్లో రైతులు ఓటమి చెందగా, కంపెనీలు తమ పంతాన్ని నెగ్గించుకున్నాయి. దీంతో తమకు అన్యాయం జరిగిందని కోకో రైతులు ఆందోళనకు దిగారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో శుక్రవారం కోకో రైతుల సమస్యలపై రైతులు, అధికారులు, ట్రేడర్లు, కంపెనీల ప్రతినిధులతో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చర్చలు జరిపారు. ఈ చర్చల్లో జిల్లా మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర, జిల్లా అధికారులు, ఎంఎల్‌ఎలు పాల్గొన్నారు. ముందుగా రైతులు బోళ్ల వెంకటసుబ్బారావు, ఉప్పల కాశీ, గోపాలకృష్ణ, ఇంటెలిజెన్స్ మాజీ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు, కోకో రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. 2024 వరకూ ఇచ్చినట్లుగా అంతర్జాతీయ ధర ఇప్పించాలని కోరారు. ట్రేడర్లు మాట్లాడుతూ కంపెనీలు ఇచ్చిన ధర ప్రకారమే తాము కొనుగోలు చేస్తామన్నారు. ఈ సమావేశానికి కంపెనీ ప్రతినిధులు హాజరు కాకపోవడం గమనార్హం. దీంతో చేసేదేమీ లేక ఆన్‌లైన్‌లో మాండలీజ్ కంపెనీ ప్రతినిధులతో మంత్రులు మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో ధర రూ.880 ఉన్నప్పటికీ తాము రూ.450కు మించి కొనుగోలు చేయలేమని కంపెనీ ప్రతినిధులు తెగేసి చెప్పారు. ఆ ధరతో తాము నష్టపోతామని, అంతర్జాతీయ ధర ప్రకారమే ధర చెల్లించాలని రైతులు కోరారు. మంత్రులు మెజార్టీ రైతుల మాటలను ఏమాత్రం పట్టించుకోలేదు. ఒకరిద్దరు మాట్లాడిన రైతుల మాటలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుతం ఉన్న పంట కొనుగోలు జరిగిపోవాలని చెబుతూ కంపెనీలు కిలోకు రూ.450 ఇస్తాయని, ప్రభుత్వం రూ.50 చెల్లిస్తుందని, మొత్తంగా కిలో రూ.500కు కొనుగోలు చేస్తారని మంత్రులు చర్చలు ముగించారు. ఇంకా 1500 టన్నుల వరకూ పంట ఉందని, మొత్తం కొనుగోలు చేయాలని కంపెనీలకు చెప్పారు. దీనిపై రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇంత పెద్దఎత్తున సమావేశం ఏర్పాటు చేసి ఏం న్యాయం చేశారని రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

కోకో ధరకు ప్రత్యేక చట్టం తెస్తాం

ఆయిల్‌పామ్ తరహాలో కోకో పంటకు మద్దతు ధర అందేలా కొత్త చట్టాన్ని తెస్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. చర్చల అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. గత సంవత్సరం వరకు కోకో పంటకు రైతులకు లాభదాయకమైన ధరను సదరు ట్రేడర్లు, కంపెనీలు అందించాయని, ప్రస్తుతం రైతులను ఇబ్బంది పెట్టేలా ట్రేడర్లు, కంపెనీలు కోకో ధరను తగ్గించి కొంటున్నాయని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. కోకో రైతులకు భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా కనీస మద్దతు ధర అందించేందుకు కొత్త చట్టాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు, ట్రేడర్లకు నష్టం కలగని రీతిలో చట్టం రూపకల్పనకు రైతులు, రైతు సంఘాల నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రస్తుతం రైతుల వద్ద వెయ్యి నుండి 1500 టన్నుల వరకు ఉన్న కోకో పంటను కిలోకు రూ.500 చొప్పున కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ కోకో పంటకు గతేడాది ధరకు ప్రస్తుతానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. కోకో ధర నిర్ణయించేందుకు ఆయా కంపెనీలు నిర్దిష్ట విధానాన్ని అనుసరించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాస్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎంఎల్‌ఎలు బడేటి రాధాకృష్ణయ్య, కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, ఉద్యాన శాఖ డిడి ఎస్.రామ్మోహన్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ భాషా, వివిధ రైతుసంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

చర్చలు విఫలం

కలెక్టరేట్ ఎదుట కోకో రైతుల ధర్నా

కోకో గింజల కొనుగోలు ధరపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ద్వైపాక్షిక చర్చలు పూర్తిగా విఫలమైనట్లు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకుండా మోసగిస్తున్న మోండలీజ్ కంపెనీ, ఇతర బహుళ జాతి కంపెనీల మోసాలకు నిరసనగా, రాష్ట్ర ప్రభుత్వ తీరును పూర్తిగా వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట కోకో రైతులు ధర్నా నిర్వహించారు. ఎపి కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రిటైర్డ్ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు నెలలుగా కోకో రైతులు పెద్దఎత్తున పోరాటం చేస్తున్నారని, వారం రోజులుగా పోరాటాన్ని ఉధృతం చేశారని చెప్పారు. మంత్రులు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, ఎంఎల్‌ఎలు, రాష్ట్ర ఉన్నతాధికారుల సమక్షంలో జరిపిన చర్చలకు భౌతికంగా రాకుండా మోండలీజ్ కంపెనీ ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది కంపెనీల లెక్కలేనితనమని విమర్శించారు. కిలో ధర రూ.450కు మించి ధర ఇవ్వలేమని చెప్పడం దుర్మార్గమని, ఇది బహుళ జాతి కంపెనీల కుట్రలో భాగమని విమర్శించారు. మరో రూ.50 కంపెనీకి ఇచ్చి రూ.500కు కొనుగోలు చేస్తామని మంత్రులు ప్రకటించిన నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు, ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ల వెంకట సుబ్బారావు, ఉప్పుగంటి భాస్కరరావు, పానుగంటి అచ్యుతరామయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి, ఉప్పల కాశీ, కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, నాయకులు కోనేరు సతీష్‌బాబు, ఎపి రైతుసంఘం నాయకులు చింతకాయల బాబూరావు పాల్గొన్నారు.


ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న కోకో రైతులు, నేతలు


దీక్షల్లో పాల్గొన్న నేతలతో ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం చేయాలి

ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

రిలేదీక్షల శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలని ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. మెగా డిఎస్‌సి-2025లో నోటిఫై చేసిన షెడ్యూల్డ్ ప్రాంత ఉపాధ్యాయ ఖాళీలను మినహాయించి షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డిఎస్‌సి ఇవ్వాలన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఎపి ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షా శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జిఒ నెం.3 స్థానంలో షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని చెప్పారు. జిఒ నెం.3ని రద్దు చేయడం వల్ల జరిగిన నష్టాన్ని భర్తీ చేయడానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ జిఒలు, చట్టాలు చేయాలని శాసనమండలిలో ప్రస్తావించానని గుర్తు చేశారు. మెగా డిఎస్‌సిలో షెడ్యూల్డ్ ప్రాంత అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం న్యాయం చేసే వరకు తాను కూడా ఈ న్యాయ పోరాటంలో భాగస్వాముడిని అవుతానని హామీ ఇచ్చారు.

తొమ్మిదో రోజుకు దీక్షలు

ఆదివాసీ జెఎసి రిలే నిరాహార దీక్షలు శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. తొమ్మిదో రోజు దీక్షలను ఎటిఎ రాష్ట్ర అధ్యక్షులు జలగం రాంబాబు ప్రారంభించి మాట్లాడారు. దీక్షల్లో తాటి సీత, కొవ్వాసు వెంకటేశ్వరరావు, కొవ్వాసు వెంకటలక్ష్మి, సవలం సంధ్య, తాటి చందన, తాటి గోపీ, తాటి అభిరామ్, తెల్లం రాములు, సరియం నాగేశ్వరరావు, తెల్లం గంగరాజు, ధర్మల బాబూరావు, మడకం శ్రీను, మడకం పాపారావు, తెల్లం లక్ష్మణరావు, సోదెం ముక్కయ్య, రవ్వ బసవరాజు, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, తెల్లం రవి ప్రసాద్, సోదెం మల్లయ్య, కుంజా గంగులు, పొడియం కొవ్వాడయ్య, అచ్చయ్యపాలెం సర్పంచి కుంజ వెంకటేశ్వరరావు, బుట్టాయగూడెం సర్పంచి తెల్లం వెంకాయమ్మ, దొరమామిడి సర్పంచి తెల్లం రాముడు, కోట రామచంద్రపురం సర్పంచి ఉయ్కె బొజ్జి పాల్గొన్నారు.

బియ్యం కార్డుల్లో మార్పులు, చేర్పులు నిరంతర ప్రక్రియ

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే నిత్యావసరాలు

1 నుంచి రేషన్ దుకాణాల్లోనే సరుకుల పంపిణీ

పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శివరామ్మూర్తి

ప్రజాశక్తి - ఏలూరు



జిల్లాలో అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణతోపాటు ఏడు రకాల సేవలను పారదర్శకంగా పునఃప్రారంభించామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శివరామ్మూర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక పౌర సరఫరాల సంస్థ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆధ్వర్యాన రైస్‌కార్డులు, రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణతోపాటు కార్డుల్లో మార్పులు, చేర్పులకు సంబంధించిన సేవలను ప్రారంభించామన్నారు. కొత్త బియ్యం కార్డు మంజూరు, కార్డులో కొత్త సభ్యుల పేర్లు చేర్చడం, సభ్యులపేర్లు తొలగించుట, బియ్యం కార్డును సరెండర్ చేయడం, బియ్యంకార్డులో చిరునామా మార్పు, కార్డులో ఆధార్ నెంబర్ సీడింగ్ చేసుకునే అవకాశం కల్పించామన్నారు. రైస్‌కార్డు సేవలపై ఏమైనా సందేహాలు ఉన్నచో 1800-425-6453 నెంబరుతో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చున్నారు. కొత్త రైస్ కార్డులు పొందేందుకు గ్రామీణ ప్రాంతాల్లో అయితే కుటుంబ సంవత్సర ఆదాయం లక్షా 20 వేలలోపు, పట్టణ ప్రాంతాల్లో అయితే లక్షా 40 వేలలోపు ఆదాయం ఉండాలన్నారు.

ఎండియు వాహనాలను రద్దు చేసి జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల వద్దే సరుకులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. డిపోల వద్ద ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ తీసుకోవచ్చున్నారు. 65 సంవత్సరాలు పైబడినవారు, వికలాంగులు రేషన్ షాపు వద్దకు వచ్చి సరుకులు తీసుకోకపోతే వారికి ఇంటికే సరుకులు అందజేస్తారన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించామన్నారు. రబీలో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యానికి ఇంతవరకు 2.51 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతుల వద్ద ఇంకా ధాన్యం నిల్వ ఉంటే నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలో 20,416 మంది రైతుల నుంచి రూ.579 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటికే రూ.502 కోట్లు వారి ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన రూ.72 కోట్లు సోమవారంలోపు వారి ఖాతాలకు జమవుతాయన్నారు.

సమైక్యతా యాత్రల్లో ప్రజలంతా పాల్గొనాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

రేషన్ వాహనాలను కొనసాగించాలి : జిల్లా కార్యదర్శి ఎ.రవి



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకు సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుండి 30వ తేదీ వరకు జరిగే సమైక్యతా యాత్రల్లో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం పిలుపునిచ్చారు. స్థానిక పవరుపేటలోని ఉద్దరాజు రామం భవనంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం ఎం.నాగమణి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లాలో కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతాంగ సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. ముఖ్యఅతిథి బలరాం మాట్లాడుతూ ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకులు 26 మందికి సంతాపం తెలిపారు. ఉగ్రదాడిని ఖండించడంలో దేశ ప్రజానీకం ప్రదర్శించిన ఐక్యత, సమైక్యతా స్ఫూర్తి గొప్పదన్నారు. మన రాష్ట్రానికి చెందిన చంద్రమౌళి, మధుసూదనరావు కూడా ఈ ఘోర హత్యాకాండకు బలయ్యారన్నారు. ఈ క్రమంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టడానికి చేసిన ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టారన్నారు. దేశ ప్రజలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలవాలని, అదే క్రమంలో ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టే మతోన్మాదశక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కుల, మత, జాతి భేదాలు లేకుండా ప్రజలంతా ఐక్యంగా నిలవాలన్నారు. మన దేశంలో జరిగిన ఉగ్రదాడికి వ్యతిరేకంగా మన సైన్యం చేసిన ఆపరేషన్ సింధూర్‌ను స్వాగతిస్తున్నామని, అదే క్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెత్తనాన్ని వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. కాల్పుల విరమణ విషయంలో ట్రంప్ చెప్పినట్లు నడుచుకున్న ప్రధాని మోడీ దేశ ప్రతిష్టకు భంగం కల్గించారని, ఈ వైఫల్యం నుండి బయటపడేందుకే తిరంగా యాత్ర అంటూ బిజెపి కొత్త నాటకానికి తెరలేపిందని విమర్శించారు. మతోన్మాదానికి, యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా అన్ని తరగతులు, మతాలు, కులాలు, వర్గాల ప్రజలు ముందుకురావాలని కోరారు. మతపరమైన విభజనలకు తావులేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ ప్రజల ఐక్యత, మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకు సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుండి 30వ తేదీ వరకూ జరిగే సమైక్యతా యాత్రల్లో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ వాహనాల ద్వారా ప్రజల వద్దకే రేషన్ అందించే పద్ధతిని రద్దు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తిరిగి ప్రజల వద్దకే రేషన్ అందించే ప్రక్రియను పునరుద్ధరించాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలని, రూ.600 వేతనంగా ఇవ్వాలని, బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర అనుసంధానం చేసి, ఫార్ములా రూపొందించి, ధర ప్రకటించి అమలు చేయాలని, కోకో గింజల కొనుగోలు కంపెనీలు, ట్రేడర్ల మోసాలు అరికట్టాలన్నారు. ఏజెన్సీలోని భూసమస్యలను పరిష్కరించాలని, చట్ట విరుద్ధంగా బుట్టాయిగూడెం తహశీల్దార్ ఇస్తున్న ప్రొటెక్షన్ ఆర్డర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నేతలు డిఎన్‌విడి.ప్రసాద్. ఆర్.లింగరాజు, పి.రామకృష్ణ, జి.రాజు, కె.శ్రీనివాస్, ఎం.సుధారాణి, ఎం.జీవరత్నం, జి.నరసింహారావు, ఎ.ఫ్రాన్సిస్, ఎన్.హనుమాన్లు, టి.దుర్గారావు, పి.మంగరాజు, ఎన్.రమణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు సిటీ :ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. రెడ్డి అప్పలనాయుడును ఏలూరులోని ఆయన నివాసంలో తాడేపల్లిగూడెం డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు చోడగిరి వెంకటరమణ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిగూడెం డిపోలో ఉన్న ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడుకు వివరించారు. ఉద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఆర్‌టిసిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని రెడ్డి అప్పలనాయుడు హామీ ఇచ్చారని వెంకటరమణ తెలిపారు. ఆయనతో పాటు పలువురు ఆర్‌టిసి యూనియన్ సభ్యులు ఉన్నారు.

టీచర్ల బదిలీలు, సర్దుబాట్లపై అవగాహనా సదస్సు

యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ప్రారంభం



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖులు


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక యుటిఎఫ్ జిల్లా కేంద్ర కార్యాలయంలో బదిలీలు, సర్దుబాట్లపై శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వందలాది మంది టీచర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ హనుమంతరావు హాజరై బదిలీలకు సంబంధించిన జిఒలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుల సందేహాలు, సమస్యలపై పరిష్కారాలు మార్గాలు వివరించారు. అలాగే యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించారు. ఈ హెల్ప్ డెస్క్‌లో ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి ఎనిమిది వరకు ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ అప్లికేషన్లు పెట్టించడంలో యుటిఎఫ్ జిల్లా టెక్నికల్ టీమ్ పనిచేస్తుందని, ఇప్పటికే వందల మంది టీచర్లు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకుని ఏలూరు యుటిఎఫ్ కార్యాలయంలో బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా ప్రధాన నాయకులు జిల్లా కార్యాలయంలో అందుబాటులో ఉండి ఉపాధ్యాయులకు వచ్చే సమస్యలను పరిష్కరించడానికి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం అధికారులతో మాట్లాడనున్నట్లు, రాష్ట్రస్థాయిలో సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. బదిలీల కార్యక్రమం పూర్తయ్యే వరకు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ కొనసాగుతుందని, అనంతరం కూడా జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సదస్సులో జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా ఆలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని, జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్, వివిధ మండలాల నాయకులు నాయకత్వం పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో ఏరియా ఆసుపత్రి అభివృద్ధి

చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

ఏరియా ఆసుపత్రి అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ కోరారు. స్థానిక ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీని నూతనంగా ఏర్పాటు చేశారు. శుక్రవారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఛైర్మన్ హోదాలో ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అంటే రోగులకు ధైర్యం, నమ్మకం, భరోసా కలిగేలా సేవలందించాలని చెప్పారు. ఆక్సిజన్ నిల్వల ఏర్పాటుపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించేందుకు మరింత కృషి చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ దేవికమలను సూచించారు. నాణ్యమైన వైద్య సేవలందించాలని వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రి ప్రాంగణంలో చెట్లు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని చెప్పారు. ఏరియా ఆసుపత్రికి ఎక్కువ శాతం పేదలే వస్తారని, వారికి మంచి చేయాలని చెప్పారు. నూతన కమిటీ ముందంజలో ఉండాలని కోరారు. నూతన కమిటీ మెంబర్లుగా కంచర్ల గణేష్, నాయుడు శ్రీను, దెందుకూరు వెంకటలక్ష్మి, మెప్మా మెంబర్‌గా కోటగిరి ప్రమీల, నియమితులయ్యారు. వారిని చింతలపూడి ఎంఎల్‌ఎ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ, తహశీల్దార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమమే లక్ష్యం

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి

పోలీసు సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు సంక్షేమ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి నేరుగా పాల్గొని సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఎవరైనా ఎప్పుడైనా తనను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవచ్చున్నారు. కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నిటిని వెంటనే పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. హోమ్ గార్డ్స్ సైతం వారి సమస్యలను తనకు వివరించారని చెప్పారు. సిబ్బంది సంక్షేమానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు.

పాఠశాల గదిలో తడిచిన బియ్యం బస్తాలు

దుర్వాసన వచ్చి గది తెరవడంతో విషయం వెలుగులోకి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


పాఠశాల గదిలో పాడైపోయిన బియ్యం బస్తాలు

మండలంలోని లక్కవరం హైస్కూల్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల 40 బియ్యం బస్తాలు వర్షపు నీటిలో తడిశాయని గ్రామస్తులు చెబుతున్నారు. వర్షం కురిసే గదిలో బియంయ నిల్వ ఉంచడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందంటునానరు. తడిసిన బియ్యం నుంచి వచ్చే దుర్వాసనను గ్రామస్తులు పసిగట్టి ఆ గదిని తెరిచి చూడగా బియ్యం బస్తాలన్నీ తడిసిపోయి ఉన్నాయి. పాఠశాలలకు సెలవులు ఇచ్చే నాటికి 40 బస్తాలు మిగలగా వాటిని ఒక గదిలో భద్రపరిచారు. ఆ గదిలో వర్షం కురవడం వల్ల 40 బస్తాల బియ్యం పాడైపోయాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూలు సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నిర్లక్ష్యానికి బాధ్యత వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరం


ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అపరిశుభ్ర పరిసరాలే అంటువ్యాధులకు కారణమని, ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించి అంటు వ్యాధులకు దూరంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి పిఎస్‌ఎస్.ప్రసాద్ సూచించారు. స్థానిక ఏలూరు లంబాడిపేట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారి డాక్టర్ ట్వింకిల్ ఆధ్వర్యంలో శుక్రవారం లంబాడిపేటలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎక్కువగా హాని చేసే డెంగీ, మలేరియా దోమలు గృహాల్లో ఉండే మంచి నీటి నిల్వ ప్రాంతాల్లో వృద్ధి చెందుతాయన్నారు. అందరూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా ప్రభుత్వాసుపత్రిని సందర్శించాలన్నారు. వేసవికాలంలో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది కాబట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ట్వింకిల్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

గర్భిణులు అర్హులైన వైద్యులనే సంప్రదించాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

గర్భిణులు అర్హులైన వైద్యులను సంప్రదించాలని, నాటు వైద్యులను, ఆర్ఎంపీలను ఆశ్రయించవద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్.మాలిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఎంపీలు గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ కు రిఫర్ చేయకూడదని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు ప్రభుత్వాసుపత్రుల్లో ఉచిత వైద్యం పొందడం వల్ల మాతృ శిశు మరణాలు నియంత్రించవచ్చని తెలిపారు. తొమ్మిది నెలల గర్భిణి కాలంలో రెండుసార్లు స్కానింగ్ చేయించుకోవచ్చని, బిడ్డ పెరుగుదల తెలుసుకునేందుకు, జన్యుపరమైన వ్యాధులు, అంగవైకల్యం నిర్ధారించుకునేందుకు గర్భిణులు అర్హులైన వైద్యులను సంప్రదించి వారి సలహా తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పరిధిలో 13, ప్రయివేట్ పరిధిలో 102 స్కానింగ్ సెంటర్లు సేవలందిస్తున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం సెక్షన్ 22 ప్రకారం ప్రయివేట్ స్కానింగ్ సెంటర్లు, మేనేజ్‌మెంట్ వారి సెంటర్‌కు సంబంధించి స్కానింగ్ ముందుగాని తర్వాత గాని లింగ నిర్ధారణ గురించి ఏ విధమైన ప్రచార మాధ్యమంలోనైనా, ప్రకటనలు ఇస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ చట్టాన్ని అతిక్రమించిన వారికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు సంబంధించి ఆసుపత్రులు ఏ విధమైన అతిక్రమణలకు పాల్పడిన ప్రజలు 1800 425 6131 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.


జెసిబితో పనులు చేయిస్తున్న గ్రామస్తులు

గ్రామస్తుల దాతృత్వం

ప్రజాశక్తి - కుక్కునూరు

చిరావల్లి పంచాయతీ మర్రిపాడు గ్రామంలో మలుపు వద్ద చెట్లు దట్టంగా ఉండి వచ్చిపోయే వాహనాలకు మార్గం కనిపించక ఇబ్బందులు ఎదురవ్వడంతో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో చిరావల్లి గ్రామానికి చెందిన కుండా సత్యనారాయణ, శనగ వెంకటేష్ చొరవ తీసుకుని తమ సొంత ఖర్చులతో జెసిబి ఉపయోగించి వచ్చిపోయే వహనాలకు మార్గం కనిపించేలా దట్టంగా ఉన్న చెట్లను తొలగించారు. దీంతో వారిని వాహనదారులు, ప్రజలు అభినందించారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న టిడిపి కూటమి నాయకులు

బయ్యన్నగూడేనికి 2 వాటర్ ట్యాంకర్లు మంజూరు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని బయ్యన్నగూడెం గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా సుమారు రూ.60 లక్షల నిధులతో 60 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు వాటర్ ట్యాంకర్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా కూటమి నాయకులు ట్యాంకర్లను ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి మండలాధ్యక్షులు పారేపల్లి నరేష్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా వాటర్ ట్యాంక్ మంజూరు చేసి గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య తీర్చిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బాలం నరేష్, వార్డు సభ్యులు ఆనం సాయి, జనసేన నాయకులు నరాల శ్రీను, సింగంశెట్టి శ్రీను, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి పారేపల్లి పవన్ పాల్గొన్నారు.

ఉంగుటూరులో యోగా తరగతులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు పంచాయతి కమ్యూనిటీ హాలు వద్ద, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన యోగా క్లాసులను ఎంపిడిఒ జి.రాజుమనోజ్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యాధికారి డిఎస్ఎస్.ప్రసాద్ సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. యోగాతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. గ్రామస్తులు, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన వ్యాన్

ఒకరు మృతి : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వ్యాన్ ముందు భాగం

ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ముగ్గురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన తాడేపల్లిగూడెం - నల్లజర్ల రోడ్డు మార్గం (కోడేరు - నరసాపురం ఆర్అండ్‌బి రహదారి) ఉంగుటూరు మండలం నాచుగుంట పరిధి హార్టికల్చర్ విశ్వవిద్యాలయం సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉంగుటూరు మండలం చినవెల్లమిల్లికి చెందిన మనెల్లి పవణ్ డీజే సౌండ్ సిస్టం అద్దెకు ఇస్తుంటారు. నల్లజర్ల మండలం నబీపేటలో ఓ వేడుకలకు డీజే సౌండు సిస్టం బాక్స్‌లను నాలుగు రోజుల క్రితం బిగించారు. ప్రోగ్రాం అనంతరం శుక్రవారం అర్ధరాత్రి వాటిని తీసుకుని డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురితో వ్యాను చినవెల్లమిల్లికి బయలు దేరింది. నల్లజర్ల నుంచి తాడేపల్లిగూడెం వైపు సిమెంటు లోడుతో వెళ్తున్న లారీ ఉంగుటూరు మండలం నాచుగుంట పరిధి హార్టికల్చర్ విశ్వవిద్యాలయం సమీపంలో నిలిచి ఉంది. ఆ లారీని వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎడమ పక్క సీటులో కూర్చున్న నల్లజర్ల మండలం పోతవరం సమీపం సుబ్రహ్మపాలేనికి చెందిన చిడిపి సాయి గణేష్ (22) అక్కడికక్కడే మృతి చెందాడు. వెల్లమిల్లికి చెందిన వ్యాను యజమాని (డ్రైవర్) మనెల్లి పవన్, మనెల్లి వేణు, పోతవరానికి చెందిన చేపల రవి గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గణేష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నామని చేబ్రోలు ఎస్ఐ సూర్యభగవాన్ తెలిపారు. నాచుగుంట విఆర్ఒ కుచ్చు పెద్దిరాజు పంచనామా రిపోర్టు అందించారు.

రైలు ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు పట్టాలు దాటుతున్న మహిళను వందే భారత్ రైలు ఢీకొనడంతో ఆమె మృతి చెందిన ఘటన ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణాజిల్లా బాపులపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పొట్లూరు కావ్య (24) భర్త సాయిరాంతో కలిసి జీవిస్తుంది. ఈ క్రమంలో శుక్రవారం ఆమె తన ఇంటి సమీపంలో ఉన్న రైలు పట్టాలను దాటుతుండగా విశాఖపట్నం వైపు వెళ్తున్న వందే భారత్ రైలు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ సైమన్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవన పాఠం నేర్పడమే 'శ్రీ గౌతమి' లక్ష్యం

విద్యాసంస్థ అధినేత ఇలపర్తి శోభనాద్రి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్


శోభనాద్రి

ర్యాంకులు, మార్కులతో పాటు జీవన పాఠం నేర్పడమే తమ శ్రీ గౌతమి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రధాన లక్ష్యమని విద్యాసంస్థ అధినేత ఇలపర్తి శోభనాద్రి స్పష్టం చేశారు. పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్డులో డాక్టర్ గుమ్మడి రామచంద్రరావు ఆసుపత్రి పక్కన సువిశాలమైన ప్రాంగణంలో శ్రీ గౌతమి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నిర్వహిస్తున్నారు. పాఠశాల నిర్వహణ, విద్యా బోధన, విద్యాసంస్థ కొనసాగే తీరు, లక్ష్యాలపై శోభనాద్రి ప్రజాశక్తితో మాట్లాడారు. తాను ఎంఎస్‌సి, బిఇడి, ఎంఫిల్ పూర్తి చేసిన తరువాత 2013 విజయవాడ అశోక్ నగర్ ప్రాంతంలోని శ్రీ చైతన్యలో లాంగ్ టర్మ్, బైపిసి క్యాంపెయిన్ కోసం బోధించిన వచ్చినట్లు చెప్పారు. శ్రీ చైతన్య విద్యాసంస్థలో పాటు నారాయణ సంస్థలో కూడా తొమ్మిదేళ్లపాటు అనుభవాన్ని గడించిన తాను నూజివీడు ప్రాంతంతో ఏర్పడిన అనుబంధం మేరకు శ్రీ గౌతమి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని సంకల్పించుకుని 2019-20 విద్యా సంవత్సరంలో పాఠశాలను తీసుకున్నట్లు చెప్పారు. తొలినాళ్లలో రెండేళ్ల ప్రపంచాన్ని కరోనా మహమ్మారి కుదిపేసిందని, కష్టాల కడగండ్ల నుంచి తేరుకుని విద్యాసంస్థను విజయవంతంగా కొనసాగించాలనే దృఢ సంకల్పంతో ముందడుగు వేసినట్లు చెప్పారు. ప్రణాళిక బద్ధంగా 420 మంది విద్యార్థులు, 36 మంది సిబ్బందితో పాఠశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ పాఠశాలలో ట్యూనీ లక్ష్మి అనే విద్యార్థిని 2019 - 20 విద్యా సంవత్సరంలో పదికి పది జిపిఎ మార్కులు, కె.గాయత్రి 9.8, రిత్విక్ పూర్తిగా 9.7 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచినట్లు చెప్పారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థుల్లో నలుగురు పోస్టుమాస్టర్లు, మరో ముగ్గురు విదేశాల్లో స్థిరపడినట్లు చెప్పారు. చదువులో అత్యుత్తమ ప్రగతి సాధించి మిగిలిన అంశాల్లో ప్రతిభ కనపరచడం ద్వారా మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకుని సమాజంలో అత్యున్నత శిఖరాలకు చేరుకోవచ్చని సోదాహరణంగా వివరించారు. ఆ దిశగానే విద్యార్థులకు లాంగ్వేజ్ డెవలప్‌మెంట్, చదవడం, రాయడం, ఆలోచన జ్ఞానం పెంపొందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు వ్యక్తిత్వం అభివృద్ధి చేసుకునే దిశగా అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించేందుకు తమ సిబ్బంది ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు నాలుగు గోడల మధ్య తరగతి గదిలో చదువు ఒక్కటే అనే రీతిగా ఎప్పటికీ బోధన కొనసాగకూడదనేది తమ లక్ష్యమన్నారు. సువిశాలమైన సమాజాన్ని నిత్యం పరిచయం చేస్తూ సమాజ హితంగా జీవించే ప్రక్రియలు వివరిస్తూ, సమాజంలో ఉన్నత శిఖరాలు అధిరోహించేలా అన్ని రంగాల్లో నైపుణ్యత సాధించి ఎలాంటి పరిస్థితులలోనైనా జీవించగలిగే ధైర్యం, మానసిక స్థైర్యం కల్పించగలుగుతున్నాం. అందుకోసం తాము విహారయాత్రలు, విజ్ఞాన యాత్రలు చేపడుతూ విద్యార్థులందరికీ అనేక ప్రాంతాల్లో సమాజ స్థితిగతులను వివరిస్తున్నట్లు చెప్పారు. నూజివీడులోని శ్రీ గౌతమి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులు ఎక్కడైనా ధైర్యంగా జీవించగలరనే నమ్మకం తల్లిదండ్రుల్లో సుస్థిరంగా ఏర్పడిందని, అదే తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నట్లు వివరించారు.


శ్రీగౌతమి విద్యాసంస్థ

వాజ్‌పేయి మెమోరియల్ ట్రోఫీకి యశోదకృష్ణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


యశోదకృష్ణ

అటల్ బీహారి వాజ్‌పేయి మెమోరియల్ ట్రోఫీ-2025కు ఆగిరిపల్లికి చెందిన వికలాంగుడు బెజవాడ యశోదకృష్ణ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్ డిఫరెన్సియల్లీ ఎబుల్డ్ క్రికెట్ కమిటీ (డిసిసిఐ) ఛైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, సభ్యులు రామన్ సుబ్బారావు, ఇల్లూరి అజయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు రాయపూర్‌లో జరగనున్న ఈ ట్రోఫీకి ఆంధ్రా నుంచి ముప్పిడి కిశోర్‌బాబు, బెజవాడ యశోదకృష్ణ, యాళ్ల సత్తిబాబులు ఎంపికైనట్లు తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేసి ఆరు జట్లుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌కు ఆంధ్ర నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికవ్వడం రాష్ట్రానికి గర్వకారణమని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు తమ ప్రతిభను చాటి రాష్ట్రానికి, వికలాంగుల క్రికెట్‌కు చేయూతనిస్తున్న ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్‌కు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్ ఎపెక్స్ కౌన్సిల్ అభినందించింది. మండల ప్రజలు బెజవాడ యశోదకృష్ణను అభినందించారు.

నిరుపేదలకు అండగా సిఎం సహాయ నిధి


మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

నిరుపేదలకు మెరుగైన వైద్య చికిత్స అందించడానికి సిఎం సహాయ నిధి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండల పరిధిలో చొప్పరమెట్ల గ్రామానికి చెందిన పి.పద్మ ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. మెరుగైన వైద్యం కోసం ఆమె కుటుంబ సభ్యులు మంత్రి పార్థసారధిని కోరగా అందుకు సత్వరమే స్పందించిన ఆయన కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే సిఎం సహాయ నిధి నుంచి రూ.60 వేలకు సంబంధించిన ఎల్ఒసిని కుటుంబ సభ్యులుకు అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

భాస్కర్ కుటుంబానికి అండగా ఉంటాం : మంత్రి

నూజివీడు టౌన్ : భాస్కర్ కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అదుకుంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. మంత్రి కొలుసు పార్థసారధి గత వారం చాట్రాయి మండలంలో పర్యటనకు వెళ్లి తిరిగి రోడ్డు మార్గంలో వస్తుండగా నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి బైపాస్ జంక్షన్‌లో రోడ్డు ప్రమాదానికి గురైన ఆటో, లారీని చూసి కాన్వాయిని ఆపి ప్రమాదానికి గల కారణాలు వారి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంలో పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జి.భాస్కర్ ఆటో పూర్తిగా ధ్వంసం కావడంతో అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ప్రమాదానికి కారణమైన లారీ యజమానితో మాట్లాడి బాధిత కుటుంబానికి మంత్రి, లారీ యజమాని ఇరువురు కలిసి సుమారు రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించారు. ప్రమాదంలో సోడా బడ్డీ ధ్వంసం అవడంతో రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం తరపున కొత్త ఆటో ఇప్పించే బాధ్యత కూడా తనదేనన్నారు. బిసి కార్పొరేషన్ నుంచి కొంత ఆర్థిథక సహాయం త్వరలో మంజూరు చేయించాలని టిడిపి స్థానిక నాయకులు అక్కినేని చందుకు సూచించారు. భాస్కర్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.


ఆగిరిపల్లి : ఎల్ఒసి అందిస్తున్న మంత్రి పార్థసారధి

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఎస్‌పి అభినందన

రక్షించిన శక్తి టీమ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడేందుకు ప్రయత్నించిన మహిళను శక్తి టీమ్ కాపాడింది. ఏలూరు శక్తి టీమ్ ఇన్‌ఛార్జి సిఐ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు నగరంలోని తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన వివాహిత కుటుంబంలో కొన్నిరోజులుగా కలహాలు నెలకొన్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె శుక్రవారం సాయంత్రం ఎన్ఆర్ఐ కళాశాల సమీపంలోని రైలు పట్టాల వద్దకు ఆత్మహత్యకు పాల్పడేందుకు వెళ్లింది. ఆమె కుటుంబ సభ్యులు 112కు సమాచారం ఇవ్వడంతో క్షణాల్లో శక్తి టీమ్ ఆమె వద్దకు చేరుకుని ఆత్మహత్యకు పాల్పడకుండా రక్షించారు. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ శక్తి టీమ్ సభ్యులను అభినందించారు.



మహిళకు కౌన్సెలింగ్ ఇస్తున్న శక్తి టీమ్

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు..!

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
పలు గ్రామాల్లో ప్రజల ఆవేదన
ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకోలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని దిప్పకాయలపాడు, రాజవరం, కన్నాపురం, బయ్యన్నగూడెం, ఎర్రంపేట, పొంగుటూరు, కన్నయ్యగూడెం గ్రామాల్లో మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఎటువంటి చర్యలూ తీసుకోవడంలేదని విమర్శలు చేస్తున్నారు. వ్యవసాయం చేసే పొలాల్లోకి మాత్రమే మట్టి తరలించేందుకు తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని, కాని ఇటుక బట్టీలకు, ఇక్కడ నుచి తెలంగాణ వరకు లారీల ద్వారా మట్టిని అక్రమంగా తవ్వి తరలించేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. చెరువు వ్యాసార్థం అనుసరించి రెండు వేల క్యూబిక్ మీటర్స్ నుంచి పది వేల క్యూబిక్ మీటర్స్ వరకు అనుమతులు ఉన్నాయని, కాని అనుమతులు ఉన్నదాన్ని కన్నా పది రెట్లు ఎక్కువగా తవ్వుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా గ్రామాలో ప్రజలు అడ్డుకుంటున్నా నాయకుల ప్రభావంతో, అధికారుల అండతో మట్టి మాఫియా రెచ్చిపోతుందని చెబుతున్నారు. దిప్పకాయలపాడులో ఉన్న రెండు ప్రధాన చెరువుల నుంచి దాదాపు ఈ వారంలో రూ.కోటి వరకు మట్టి తవ్వకాలు జరిగాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అనుమతులు మించి తవ్వకాలు జరగడంతో చెరువు లోతు పెరిగి భవిష్యత్తులో తాము ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని చెరువు చుట్టూ పక్కన ఉన్న రైతులు వాపోతున్నారు. అధిక వర్షాభావంతో గట్లు తెగి పొలాలు నీట మునిగి నాశనమవుతాయని ఆందోళన చెందుతున్నారు. మట్టి అక్రమ తవ్వకాల విషయంపై సంబంధిత అధికారులకు అనేక ఫిర్యాదులు చేసినా కనీసం ఎలాంటి స్పందన లేదని, అసలు పట్టించుకోవడంలేదని, దీంతో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.


సాగుతున్న మట్టి అక్రమ తవ్వకాలు

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా రేషన్ అందించాలి

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

గత వైసిపి ప్రభుత్వంలో గాడి తప్పిన రేషన్ పంపిణీ వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని దెందులూరు ఎంఎల్ఎచింతమనేని ప్రభాకర్ తెలిపారు. మండల పరిధిలోని రేషన్ డీలర్ల అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఉదయం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా రేషన్ వాహనాల ప్రక్రియను రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఎంతో అభినందనీయమన్నారు. గతంలో వైసిపి చేపట్టిన రేషన్ పంపిణీ వాహనాల విధానం వల్ల డీలర్ల వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. వాహనాలు వచ్చిన సమయంలో ఇంటి వద్ద లేని ప్రజలు రేషన్ తీసుకునే విషయంలో తీవ్ర ఇబ్బందులపాలయ్యారన్నారు. తిరిగి రేషన్ డీలర్ల వ్యవస్థను బలోపేతం చేసే దిశగా, రేషన్ పంపిణీ వ్యవస్థలో నిరుపయోగంగా మిగిలిన రేషన్ వాహనాల ప్రక్రియను రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం ఎంతో అభినందనీయమన్నారు. రేషన్ పంపిణీ వ్యవస్థ పేద బడుగు బలహీన తరగతుల జీవన విధానంలో ఎంతో ఆవశ్యకత కలిగిన అంశమని, ప్రభుత్వం అందించే రేషన్ సరుకులను కార్డు లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ఎటువంటి అవినీతి, అక్రమాలు, విమర్శలకు తావు లేకుండా ప్రజలకు చేరవేసే విధంగా రేషన్ డీలర్లు కృషి చేయాలని సూచించారు.

జిల్లా యోగా అసోసియేషన్ ఎంపిక

ఆగిరిపల్లి :యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆగిరిపల్లికి చెందిన యండూరు నరసింహామూర్తి, బొద్దూరు సాంబశివరావు ఎంపిక కాగా, ఉపాధ్యక్షులుగా నున్న కాళీ ప్రసాద్(కలిదిండి), కోశాధికారిగా అద్దంకి పోతులూరి వీర బ్రహ్మచారి (ఆగిరిపల్లి), సంయుక్త కార్యదర్శిగా గూడవల్లి నాగమురళీ(నూజివీడు), కార్యవర్గ సభ్యులుగా జూలూరు వేణుగోపాల్, తిరువీధుల విజయభాస్కర్, పేరూరి వెంకట రాజేష్, జ్యోతి కుమారి ఎంపికయ్యారు. వీరికి ఆంధ్రప్రదేశ్ యోగా అసోషియేషన్ కార్యదర్శి అల్లాడి రవికుమార్ నియామక పత్రాలను అందించారు.

మంత్రి అచ్చెన్నాయుడుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు కలపర్రు టోల్ ప్లాజా వద్ద దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, ఎఎంసి ఛైర్మన్ గారపాటి రామసీత సహా పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి దెందులూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

మాలదాసు సామాజిక తరగతి కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల మాలదాసు సామాజిక తరగతి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షులు పుణ్యేశ్వరావు తెలిపారు. మండలంలోని తిరుమల దేవిపేట పంచాయతీలోని వెంకటాపురం గ్రామంలో జరిగిన మాలదాసు ఆత్మీయ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గజ్జెల పుణ్యేశ్వరరావు, ఉపాధ్యక్షులు టిశ్రీను, కార్యదర్శిగా జెట్టి అరుణ్ కుమార్, కోశాధికారిగా మొగరాజు శేషారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పుణ్యేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక తరగతి సంక్షేమం, అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

జనసేనలోకి చేరిక

దెందులూరు :దెందులూరు నియోజకవర్గం దెందులూరు మండలం పోతునూరు గ్రామంలో వైసిపికి చెందిన 35 కుటుంబాలు పండూరి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జనసేన నియోజకవర్గ నాయకులు కొఠారు ఆదిశేషు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వారికి ఆదిశేషు జనసేన పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క జనసేన కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుందని, ఎటువంటి ఇబ్బందులు వచ్చినా తనను కలవవచ్చని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పోతునూరు గ్రామానికి సంబంధించి జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు కమిటీని ఏర్పాటు చేశారు.